# కాదు సుమా, కళ కాదు సుమా!

"చదువైంది కదా, ఏం చేద్దామని ప్లాను?" అడిగాను అమర్‌నాథ్ రావ్‌ని- అబ్బో! పదిహేనేళ్ళనాటి మాట. బి. కాం. ఆఖరి పరీక్ష రాసి మర్నాడే వాళ్ళ పల్లెకి వెళ్ళిపోతున్నాడు.

"ఇంకొంచెం సౌండు పెట్టండి" టేప్ రికార్డర్ వైపు చూపాడు. అంతే! కళ్ళు మూసుకున్నాడు, తల వూపుతున్నాడు, చేతి వ్రేళ్ళు ఆడిస్తున్నాడు, కవిత్వంలో అక్షరం అక్షరం ఆస్వాదిస్తున్నాడు. "కన్నెతారకల కలగానముతో, వెన్నెల తేరుల ఉయ్యాలలలో; ఉత్సాహముతో ఊగుచుండుటిది కాదు సుమా కల కాదు సుమా!"

పాట అయిపోయాక మళ్ళా ఇందాకటి ప్రశ్న అడిగాను. ''ఎవరు రాశారండి, ఈ పాట?'' అని అడిగాడే తప్ప నా ప్రశ్నకి జవాబులేదు. "రికార్డ్‌మీద తాపీ ధర్మారావుగారి పేరుంది. కాని నిజానికి తోలేటి వెంకటరెడ్డిగారు రాసేరుట." అన్నాను.

టేపు తిరుగుతోందిగా- మళ్ళీ అమర్ కళ్ళుమూశాడు. 'మలయానిల లాలనలో పదే పదే పరవశమై, గానమేలు ఎలకోయిల గళ మధురిమ నేనే, మాయని తీయందనాలు, మన వరాలే- అవలీలగా, జగమేలగా, నవ చైతన్య సమ్మోహ సమ్మేళన మేనే, అందానికి అందము నేనే, జీవన మకరందము నేనే!'

మళ్ళా ప్రశ్న వేశాను. ఎందుకంటే అమర్ సామాన్యుడు కాదు, కోటీశ్వరుడి ఏకైక పుత్రుడు. ఆయన సినిమా ప్రొడ్యూసరు. కాక మద్రాసులో చాలా పెద్ద ప్రెస్ ఒకటి వుంది. సినిమా తీస్తే రచనా విభాగంలోను, పత్రిక పెడితే సంపాదక వర్గంలోను నన్ను తీసుకోగలడు.

టేపు అటేపూ ఇటేపూ మంచి పాటల్తో నిండి వుంది. అదంతా అయ్యేదాకా ఆగాలి. కాని మాట్లాడాలనే వుంది. మాట కలుపుతాడని ఆశతో 'మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రాశారు!' అన్నాను. ఈలోగా మరో పాట వొచ్చింది. 'తలపు దాటనీక మనసు తలుపు వేయగలను గాని, నింగిపైకి ఆశలనే నిచ్చె నేయగలను గాని, కొలనులోన

కోర్కెలనే అలలపైన ఊగే కలువ పేద బ్రతుకులోన వలపు తేనె నింపేనా? చందమామ ఈ కనులకు విందేనా?'

"ఇది తెలుసు, కృష్ణశాస్త్రిగారి రచన!"

మాటలు కలుస్తున్నాయి గాని పాటల గురించే, ఊపు తీపులో ప్రపంచం తెలీడం లేదు. "కన్నుల వెన్నెల కాయించి, నా మనసున మల్లెలు పూయించి, కనులను మనసును కరగించి మైమరపించి, నన్నలరించి, నీవేలే నను పిలిచినది!"

"ఆహా! ఎంత మంచి కవిత్వం సార్! ఈ సాయంకాలం ఇంత అందంగా గడుస్తుందని ఊహించలేదు. థాంక్స్!" అవి అప్పటి ఆఖరు మాటలు. అంతే, ఈ పదిహేనేళ్ళనుంచి అతని జాడలేదు. వాళ్ళ నాన్నగారి సినిమా పరిశ్రమలో ఏదో చిన్న బాధ్యతలో వున్నాడని, పనీ, వ్యాపారం నేరుస్తున్నాడని తెలిసేది. కొన్నాళ్ళపాటు ఉత్తరాలు రాశాను. దేనికీ సమాధానం లేదు. జనవరి 1వ తేదీన గ్రీటింగ్ మాత్రం ఖాయంగా వస్తుంది.

ఎల్. టీ సీ. పెట్టి కుటుంబంతో సహా తిరుపతి వెళ్ళాను. కాకతాళీయంగా కనపడ్డ రామం కార్లో మద్రాసు వెళ్ళాం. అమర్ తన ఇంటి ప్రక్కనే వున్నాడన్నాడు రామం.

వెళ్ళాను. 'ఉప్పుడే బేటి కెళ్లారండి, ఎవురన్నా వస్తే కూర్చో బెట్టమన్నారు. అరే, రికార్డ్ వెయ్యరా' అని. అమర్ భార్యట, ఆవిడ చెప్పగా కూర్చున్నాను. కుర్రాడు విజృంభించాడు.

"అందిస్తా, అమృతం కొట్టు గురూ!"- "ఏమిస్తావో యివ్వ మందో మాకో నాకు!" విన్నాను. "కొంచెం మంచివి పెట్టుబాబూ" అన్నాను. నవ్వాడు. "పైటలాగా నన్ను నీవు కప్పుకోవే, గుండెలోన గువ్వలాగా ఉండిపోవే, పండే పచ్చని నేలా, అది బీడై పోతే మేలా? కాపుకాస్తే కాయలన్నీ జారిపోవా? దాపుకాస్తే కోర్కెలన్నీ తీరి పోవా?''— "ఇంకా మంచివి చూడు," అన్నాను.

''ప్రేమ పుట్టిందా, పెర పెర లాడిందా!" పెట్టాడు. అదయ్యాక 'శివమెత్తిపోతోంది, చెయిదాటిపోతోంది, చలిపెరిగిపోతుంది, గిలిగింత పెడుతోంది' పెట్టాడు. 'గోవిందా! కన్నెపిల్ల పైట జారిందా? కోక

తడిసిపోయిందా? కొత్తబెరుకు తీరిందా? గుర్రు గుర్రు మంటూందా? ఈత నీకు వచ్చిందా? లోతుపాతు తెలిసిందా?'- అదీ తీయించేశాను సగంలో.

'సీమనుంచి వచ్చావా, చిట్టిగారె తింటావా? లేత సరుకుందిరో, కూత కొచ్చిందిరో, రెమ్మలాంటి దాన్నిరో, తుమ్మెదల్లే వాలిపో!' సగందాకా కూడా విన్లేదు. 'కొంచెం పాతవి తియ్యి' అన్నాను.

''చిలక కొట్టుడు కొడితే చిన్నదానా, పలకమారిపోతావే పడుచుదానా!"- "అది వద్దు. ఇంకా పాతది, మంచిది!" అన్నాను. "లే, లే, లే-లే నా రాజా! లేవనంటావా? నిద్దుర లేపమంటావా? రాతిరయ్యిందా? నన్నే లేచి రమ్మందా?" అది కాదన్నాను. "కడవెత్తు కొచ్చింది కన్నె పిల్ల- కాడెత్తు కొచ్చాడు గడుసు పిల్లాడు" పెట్టాడు. "ఇంకా పాతది" అన్నాను.

"నల్లవాడే, అమ్మమ్మా, అల్లరి పిల్లవాడే! చిన్నవాడనుకొని చేరదీస్తే ముంచుతాడే!"

అమర్ వచ్చాడు. "హల్లో రామనాథంగారూ! నూరేళ్ళాయుష్షు మీకు. నేను స్వంతంగా పిక్చర్ తీస్తున్నాను, పాటలు రాయడానికి మిమ్మల్ని సెలక్ట్ చేశాను. ఇప్పుడే మీకు ఉత్తరం వేశాను" అని ఫైల్ చూపించాడు.

'ఏంటి; ఈ సాంగ్స్ అన్నీ ఫాలో అవుతున్నారా? బెస్టు! దిగండి రంగంలోకి. స్వాగతం! మీరే తల్చుకుంటేనా? మీ చేత ఆ దిక్కుమాలిన వుద్యోగం మాన్పించి ఏడాదిలో మేడ కట్టించనూ?' ఏదో అంటున్నాడు.

నాకు స్పృహ వచ్చేసరికి రామం ఇంట్లో వున్నాను. అతని చేతిలో వైజాగ్‌కి టిక్కెట్లున్నాయి.

'చిన వాల్తేరులో వుందండి హాస్పిటలు. పదిహేను రోజుల్లో నయం కావచ్చు!' అని, రామం మా ఆవిడకి ధైర్యం చెబుతున్నాడు.

(24-3-79)